# తృప్తి

మంచి ఎండాకాలం మిట్ట మధ్యాహ్నం కావస్తోంది. ఆరుగంటలపాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణంచేసి దిగ్గానే ఆకలి కేకలు తారాస్థాయి నందుకున్నాయి. బ్యాగుల్ని కిందపెట్టి ఆ హడవిడికీ హడిలిపోతూ ఒకరిమొఖాలొకరు చూసుకున్నారు రమణయ్య, రంగయ్యలు.

పట్నం గురించి ఇద్దరికీ తెలిసింది అంతంత మాత్రమే. కలెక్టరాఫీసులో పనుండి-ఎందుకైనా మంచిదని ఇద్దరు మిత్రులు కలిసే బయల్దేరారు

"ఇంట్లో టిఫినైనా తిన్లేదు. బస్ టైమయ్యిందని పరిగెత్తుకొచ్చేశాను" వగర్చాడు రంగయ్య.

"నేను అంతే. ఆకలి దంచేస్తోంది. ముందు హోటల్కెళ్లి ఆ తర్వాత పని చూసుకుందామా?" అన్నాడు రమణయ్య.

''అలాగే, కానీ హోటలెక్కడుందో అడిగితే?''

''ఛీఛీ. ఎవర్నడిగినా పరువు పోతుంది. పట్నం మనుషుల సంగతి నీకు తెలీదు.''

"మరెలా?"

"తిన్నగా నడుద్దాం.... ఎక్కడో కనబడకపోదు."

నాలుగు ఫర్లాంగులు నడిచినా హోటల్ కనబడలేదు. ఒకర్నొకరు చూసుకుంటూ ఆశాభావంతో మరికొంత దూరం నడిచారు.

''అదిగో అటుచూడు'' కుడివైపు రోడ్డుపక్క అరుగుమీద నిలబెట్టిన బోర్డును చూపించాడు రమణయ్య. రంగయ్య ముఖం విప్పారింది.

"భోజనం తయార్" బోర్డును గట్టిగా చదివాడు. లోపలికి ప్రవేశించారు. వెయిటింగ్ రూంలా వుంది - బెంచిమీద కూర్చున్నారు. చెమటలు కక్కుతున్న ఒంటిని సీలింగ్ ఫానుగాలి హాయిగా స్పర్శించింది

ఎదురుగా గోడమీద తగిలించిన 'హౌస్‌ఫుల్' బోర్డుమీద ఇద్దరి దృష్టి ఒకేసారి పడింది.

"అదంతే. భోజనం హాల్లో సీట్లు ఖాళీగా లేకపోతే అలాగే బోర్డు తగలిస్తారు. సీట్లుఖాళీ కాగానే తీసేస్తారు" చెప్పాడు రమణయ్య రంగయ్య చెవిలో.

అరగంట గడిచింది. చేతులు తుడుచుకుంటూ ఒకరిద్దరు బయటికొచ్చారు. ఎవరూ లోపలికి రమ్మని పిలవడం లేదు హౌస్‌ఫుల్ బోర్డు తొలిగించడం లేదు.

మొహమాటంతో కాస్సేపలాగే కూర్చున్నారు. ఎవరోఇద్దరు గబగబా లోపలికెళ్లారు.

ఇహ లాభం లేదని బ్యాగుల్ని తగిలించుకుని నేరుగా లోపలికెళ్లారు.

లోపలిహాల్లో భోజనాలెవరూ చెయ్యడం లేదు. జనాలైతే ఉన్నారు. కొందరు రేకులమీద, అట్టలమీద పెద్దపెద్ద అక్షరాలు రాస్తున్నారు. ఏవేవో బొమ్మలేస్తున్నారు.

"ఏంకావాలండీ" అడిగాడు ఒకాయన.

"భోజనం కావాలండి" నసిగాడు రమణయ్య.

ఆ మనిషికేమీ అర్థంకాలేదని అతని మొహమే చెప్తోంది.

'ఇది హోటల్ కాదాండీ?' ఆయోమయం నుంచి తేరుకుంటూ అడిగాడు రంగయ్య.

"ఇది హోటల్ కాదు. మరో నాలుగడుగులేస్తే అక్కడుంది."

'మరి బైట బోర్డు....' కోరస్‌గా అడిగారు.

అతడికి సంగతి అర్థమైంది. అయినా అదేమీ తెలీనివ్వకుండా "ఓ అదా, అది మేంరాసిన బోర్డు బైట అరబెట్టాము. మీ గేదైనా కావలిస్తే చెప్పండి అందంగా రాసిస్తాము" అన్నాడు కళ్లజోడు సరిచేసుకుంటూ. అతడి ప్రయత్నం వీరికి అర్థమయ్యింది.

"నయమే పల్లెటూరు బైతులమని గేలిచేశాడు కాదు. మంచివాడు కాబట్టి పరువు కాపాడేడు." మనసులోనే అతడ్ని దీవిస్తూ వెనుదిరిగేరు ఇద్దరూ.

(ఆంధ్రభూమి 6-8-1988)